



# దొరగారి దయ్యం

**రెండో** ఆట సినిమాచూసి గబగబా ఇంటికి నడిచి పోతున్నాడు ప్రకాశరావు. రాత్రి రెండు గంటలయింది. వీధిదీపాలు వెలగటంలేదు. ఆకాశమంతా దట్టంగా మేఘాలు కమ్ముకు ఉన్నాయి. ఊరంతా గాఢాంధకారం ఆవరించి ఉంది. వర్షం ఎక్కడ ముంచుకుని వస్తుందో నని ఇంకా వేగంగా నడకసాగించాడు ప్రకాశరావు. దారిలో లైటు లేకుండా ఎన్నో రిక్షాలు, జట్కాబళ్ళు గట్టిగా చప్పుడుచేస్తూ పరిగెత్తుతున్నాయి. రోడ్డుమీద నడుస్తున్న ప్రకాశరావులాంటివాళ్ళ నుద్దేశించి "తప్పుకోండి బాబూ" అని రిక్షావాళ్ళూ, జట్కావాళ్ళూ గట్టిగా కేకలు వేస్తున్నారుకూడా. బళ్ళకింద పడకుండా, మరీ పక్కగా నడిచి లైటు స్తంభాలకు గుద్దుకోకుండా జాగ్రత్తగా నడవాలనే ప్రయత్నంలో మెల్లిగానే నడవవలసివచ్చింది. ఉన్నట్టుండి చల్లటి గాలి వీచి కుండపోతగా వర్షం ప్రారంభమైంది. ఒక పెద్ద మెరుపు



**జర్మనీ ఫెడరల్ రిపబ్లిక్‌లో,** 1972లో జరగబోయే ఒలింపిక్ ఆటలపోటీల్లో తొలిసారిగా విలువిద్యా ప్రావీణ్యంకూడా ఒక ఆటగా చేర్చటానికి అంతర్జాతీయ ఒలింపిక్ సంఘం ఇటీవల నిశ్చయించింది. నురెంబర్గ్‌లో విలువిద్యలో ఇటీవల జరిగిన 10 వ ఛాంపియన్‌షిప్ పోటీలో పాల్గొన్న విలువిద్యా ప్రవీణులు ఈ నిర్ణయానికి అత్యధికంగా ఆనందించారు. అత్యంత వైభవోపేతమూ, ఆకర్షణీయమూ అయిన ఈ విలువిద్య అభ్యసిస్తున్నవారి సంఖ్య జర్మనీలో పెరుగుతూంది. ఈ సంవత్సరం జర్మన్ ఛాంపియన్‌షిప్స్ పోటీల్లో పాల్గొన్నవారి సంఖ్య క్రిందటి ఏడాది సంఖ్యకంటె రెట్టింపు ఉండటమే అందుకు నిదర్శనం. *

మెరవగా తాను ఎక్కడ ఉన్నదీ తెలిసింది. కలెక్టరు ఆఫీసు గేటుముందు నడుస్తూ ఉన్నాడు. చటుక్కున గేటు తోసేసరికి తెరుచుకుంది. పరిగెత్తుకుంటూ వచ్చి ఒక్కదూకులో ఆఫీసువరండాలో పడ్డాడు.

ఆ ఆఫీసుతో ప్రకాశరావుకు బాగా పరిచయం. ఇరవై అయిదేళ్ళక్రితం తాను కొత్తగా రెవెన్యూ డిపార్టుమెంటులో గుమాస్తాగా చేరిన రోజుల్లో అదే ఆఫీసులో పనిచేసేవాడు. ఒక్కొక్క సెక్షన్‌లో కొన్ని సంవత్సరాలుగా పనిచేయటంవల్ల ఆ భవనమంతా పూర్తిగా తెలుసు. చాలా ఎత్తయిన రాతిమేడ. ఇరుపక్కలా, మధ్యలోనూ పెద్ద హాల్సు ఉండటంవల్ల మూడుచోట్ల భవనం ముందుకు పొడుచుకువచ్చింది. మూడు చోట్లా ఎత్తయిన గోపురాల్లాంటివి కట్టబడి ఉన్నాయి. పెద్దపెద్ద కిటికీలూ, ఎత్తయిన తలుపులూ అవన్నీ చూస్తే ఎప్పుడో కట్టిన కోటలాగ కనిపిస్తుంది. వరండాలో అంతా చీకటిగా ఉంది. కన్ను పొడుచుకున్నా ఏమీ కనిపించటంలేదు. కాపలావా డెవడైనా ఉన్నాడేమోనని అటూ ఇటూ కాస్సేపు తిరిగాడు ప్రకాశరావు. ఏ అలికిడీ లేదు. వర్షం ఇంకా ఎక్కువ జోరుగా పడుతూనే ఉంది. అప్పుడే బయటికి వెళ్ళటానికి అవకాశం చిక్కేట్టులేదు. వరండాలో రాతిస్తంభాన్ని ఆనుకుని నిలుచున్నాడు. మనస్సు గతస్మృతుల్లోకి పరిగెత్తింది.

కొత్తగా తాను ఉద్యోగంలో చేరినప్పుడు కలెక్టర్లు అంతా ఇంగ్లీషు దొరలు ఉండేవారు. హెడ్‌గుమాస్తాలంతా తలపాగాలవాళ్ళూ, నామాలరాయుళ్ళూ ఉండేవారు. పొద్దుటే ఎనిమిదిగంటలకే ఆఫీసుకు వెళ్ళి రాత్రి ఎనిమిదింటికి ఇల్లు చేరుకునేవాడు. ఎంత కష్టపడి పనిచేసినా ఏదో ఒక లోటు కనిపెట్టేవాళ్ళు పైవాళ్ళు. అయినా జీవితంలో ఎంతో సంతృప్తి ఉండేది. జీతం తక్కువే అయినా తనూ తన భార్యా తిని, ఖర్చుపెట్టుకోగా కొన్ని రాళ్ళు వెనకవేసేవాళ్ళకూడా ప్రతినెలా. ఆ రోజుల్లోనే జీవితంలో ఎక్కువ సుఖం ఉండేదనిపించింది.

దగ్గిరలోనే పిడుగు పడింది. చెవులు అదిరిపోయే శబ్దం! ప్రకాశరావు ఆలోచనల పరంపరకు అంతరాయం కలిగింది. తనవెనక నెవరో వ్యక్తి నిలుచున్నట్లు అనిపించింది. తిరిగి చూశాడు. గుండె గుభేల్‌మన్నది! అంత చీకట్లోకూడా మెరిసిపోయే తెల్లటి ముఖం! వెండిరంగు జుట్టు, ఆరున్నర అడుగుల ఎత్తు విగ్రహం! పాతికేళ్ళక్రితం అక్కడ కలెక్టరుగా పనిచేసిన విల్సన్ దొరగారు! అప్పుడే సీమనుండి దిగినవాడిలా పూర్తిగా సూటూ బూటూ — వేషం నిండుగా ఉంది. నోట్లో తడి ఆరిపోయింది ప్రకాశరావుకు. తడబడుతూ "గు—గు—గుడ్‌మార్నింగ్, సార్" అనగలిగాడు, రెండు చేతులూ తలపైకి పోనిస్తూ అలవాటు ప్రకారం. కాని తలపాగా కట్టుకోవడం మానేసి చాలా రోజులైంది. "గుడ్‌మార్నింగ్ మిస్టర్ ప్రకాశం, హౌ ఆర్ యూ?" పెద్ద చిరునవ్వుతో తల ఊపుతూ ప్రశ్నించాడు విల్సన్ దొర.

"చిత్తం, దొరగారి దయవల్ల అంతా. . ." నోట్లో మాటలు రావటంలేదు. పందొమ్మిది వందల నలభై ఒకట్లో విల్సన్‌దొర జిల్లాకలెక్టరుగా ఉండేవారు. ప్రపంచయుద్ధసమయం కాబట్టి మద్రాసులో ఆర్జెం

